పక్షే మోస్, కమలాపూర్

# పెరిగిపోతున్న పోలీసు కాల్పులకు వ్యతిరేకంగా ఉద్యమించండి !

## పద్కల్, నగరి, బాన్స్‌వాడ, ఇడిమేపల్లి, అప్పాపురం కాల్పులకు బాధ్యులయిన పోలీస్ అధికార్లను శిక్షించాలి !

## అన్ని పోలీస్ కాల్పులపైన న్యాయవిచారణ జరిపించాలి!

ప్రజలారా !

చాలా ఏళ్ళుగా మన రాష్ట్రం 'ఎన్ కౌంటర్ల'కూ, లాకప్పు మరణాలకూ ఖ్యాతికెక్కింది. గత 20 సంవత్సరములలో పోలీసులు 658 మందిని 'ఎన్‌కౌంటర్ల'లో కాల్చేసారు. సంవత్సరానికి సగటున 20 లేక 25 మంది ముద్దాయిలను లాకప్పులలో చంపుతున్నారు. పౌరుల ప్రాణాలకూ, జీవనానికీ రక్షణ కల్పించవలసిన పోలీసు యంత్రాంగం పౌరుల ప్రాణాలు తీయడానికి వీలులేదనీ, పోలీసుల చేతిలో ఎవరు ఏ రకంగా చనిపోయినా దానిని హత్యగా భావించి పోలీసుల మీద కేసు పెట్టాలనీ పౌరహక్కుల ఉద్యమం ఆందోళన చేస్తూ వుంది. గడిచిన కొద్ది సంవత్సరాలుగా ప్రజలలోనూ ఈ విషయంలో చైతన్యం బాగా పెరుగుతూ వుంది. లాకప్పు మరణాలను ప్రజలు యివ్వాళ సహించడం లేదు. 'ఎన్ కౌంటర్' కథలు నమ్మడం లేదు. ప్రజల చైతన్యంలో వచ్చిన ఈ మార్పు తెలుగుదేశం ఓటమికి కొంతమేరకు దోహదం చేసిందని అందరూ గుర్తిస్తున్నారు. అయితే ఆ ఓటమి వల్ల లాభం పొందిన కాంగ్రెస్ పాలకులు మట్టుకు గుణపాఠం తీసుకున్నట్లు లేరు. లాకప్పు మరణాలు ఎప్పటిలాగ సాగుతూనే వున్నాయి. మొన్నటి ఎన్నికల తరువాత 8 లాకప్పు మరణాలు జరిగాయి. 'ఎన్ కౌంటర్లు' ఒక రాజకీయ నిర్ణయంగా తాత్కాలికంగా ఆగాయి గానీ, మళ్ళీ ఎప్పుడయినా మొదలు కావచ్చుననడానికి సంకేతంగా మొన్నటి మే 8వ తేదీన అనంతపురం జిల్లా ఓబులనాయునిపల్లిలో ఒక 'ఎన్ కౌంటర్' జరిగి కేశనాయక్ అనే గిరిజన యువకుడిని పోలీసులు కాల్చేశారు.

ఇదంతా మామూలేననుకున్నా, కాంగ్రెస్ పాలనలో పెరిగిపోతున్న పోలీసు కాల్పులను గురించి ప్రత్యేకంగా ఆందోళన చెందక తప్పదు. చెన్నారెడ్డి హయాంలో యిప్పటికి అయిదు [ఏడు] చోట్ల పోలీసు కాల్పులు జరిగి 16 [20] మంది ప్రాణాలు కోల్పోయారు. పెద్దఎత్తున దొమ్మీలు జరిగి ప్రాణానికీ, ఆస్తికీ నష్టం సంభవిస్తే, దానిని అరికట్టడానికి పోలీసులు అనివార్యంగా కాల్పులు జరపవలసి వచ్చిందనుకొంటారేమో, అటువంటిదేమీ లేదు. ఈ అయిదు [ఏడు] కాల్పులూ పూర్తిగా నిష్కారణమయినవే. పైగా చాలా పిచ్చలవిడిగా విశృంఖలంగా జరిగాయి. ప్రాణాలు కోల్పోయిన వాళ్ళంతా పేద ప్రజలే. కష్టం చేసుకొని బ్రతికేవాళ్ళే. సంఘ వ్యతిరేక శక్తులు కారు, ఘరానా నేరస్థులు కారు. నిజామాబాద్ జిల్లా పద్కల్‌లో కరెంటు కోతకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న రైతుల మీద కాల్పులు జరిపారు. బాన్స్‌వాడలో కుస్తీపోటీల దగ్గర తలెత్తిన చిన్న తగాదాను సర్పంచ్ సామరస్యంగా పరిష్కరించే ప్రయత్నం చేస్తుంటే ఊరుకోలేక పోలీసులు జోక్యం చేసుకొని జనం ఆగ్రహానికి గురయి జనం మీద ప్రతీకారంగా కాల్పులు జరిపి, ఆరుగురిని చంపారు. ఇంద్రవెల్లి తరువాత రాష్ట్రంలో యివే పెద్ద కాల్పులు. నగరిలో హరిజనులకూ ముస్లింలకూ మధ్య వచ్చిన తగాదాను స్థానిక ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని పరిష్కరిస్తే సరిపోయేది. అయితే ప్రజా ప్రతినిధులు తమ స్వార్థం కోసం సమస్యను

(.... 2)

పెంచి పోషించగా పోలీసులు అనవసరంగా జోక్యం చేసుకొని యిద్దరు స్త్రీలతో సహా ముగ్గురిని కాల్చేసారు. ఇడిమేపల్లిలోనూ స్వల్పమయిన తగాదాలో అనవసర బలప్రయోగం చేసి ముగ్గురిని కాల్చేసారు. అప్పాపురంలో తుఫాన్ బాధితులు తమకు సహాయం సక్రమంగా అందడంలేదని ఆందోళన చెందితే వారి ఆందోళనను అధికారులు సహృదయంగా అర్థం చేసుకొని సహాయచర్యలలోని అక్రమాలను తొలగించవలసిందిపోయి, పోలీసులు అనవసరంగా రంగ ప్రవేశం చేసి, కాల్పులు జరిపి, యిద్దరిని చంపారు.

ఇవ్వాళ ప్రజలలో తమ జీవన పరిస్థితుల పట్ల అసహనం బాగా పెరిగింది. ఈ అసహనం చాలా తరచుగా అల్లర్ల రూపం తీసుకుంటూ వుంది. అల్లర్లు ఒక్కొక్కసారి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరగగా ఒక్కొకసారి ప్రజలలోనే రెండు వర్గాల మధ్య తగాదాల రూపం తీసుకుంటున్నాయి. ఏ రూపం తీసుకున్నా అల్లర్లు, అలజడి, ఘర్షణ, చాలా సాధారణ విషయాలయి పోయాయి. ఈ పరిస్థితి ప్రజాస్వామ్యానికి ఒక పరీక్ష వంటిది. నిజమయిన ప్రజాస్వామిక పాలనలో యిటువంటి అల్లర్లకు పాలనా యంత్రాంగం వెంటనే స్పందించాలి. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికార్లు (కలెక్టర్ కావచ్చు, విద్యుత్ శాఖ అధికార్లు కావచ్చు, పౌర సరఫరా అధికార్లు కావచ్చు) ఆందోళనలో లేక అల్లర్లలో పాల్గొంటున్న ప్రజల దగ్గరికి పోవాలి. సమస్యను తెలుసుకోవాలి. తక్షణం పరిష్కారం చూపించలేకపోయినా కనీసం ఉపశమనం కలిగించాలి. అల్లరిని శాంతింపజేయాలి. అయితే మన దేశంలో యిదేమీ జరగడంలేదు. అలజడి జరిగితే ప్రభుత్వ అధికార్లూ, ప్రజాప్రతినిధులూ ఆ తావులకు కూడరారు. సమస్య ఏమిటో తెలుసుకోరు, పరిష్కరించే ప్రయత్నం చేయరు. ముందు అలజడిని అణిచేస్తే, ఆ తరువాత మాట్లాడుకుందాం అనేది వారి దృక్పథం. పోలీసులు మట్టుకు అణచివేతకోసం బయలుదేరుతారు. వాళ్లకు సమస్యను అర్థం చేసుకునే నేర్పుగానీ, దానికి కావలసిన ప్రజాస్వామిక దృక్పథం గానీ వుండదు. అవి పోలీసు యంత్రాంగం తర్ఫీదులోనే లేవు. కాని మూర్ఖంగా అణచివేయడానికి పోలీసులు ప్రయత్నిస్తే ప్రజలు సహజంగానే మరింత సహనం కోల్పోతారు. పోలీసుల లాఠీలు లాక్కోవడం, పోలీసుల మీదకి రాళ్లు వేయడం మొదలయిన చర్యలకు పాల్పడతారు. ఇవి చట్టవ్యతిరేకమయిన చర్యలే కావచ్చును గానీ; సమస్యను అర్థం చేసుకోకుండా అణచివేతనే పరిష్కారంగా ఎంచుకుంటే ప్రజలు సహనం కోల్పోవడం సహజం. ఇక అప్పుడు పోలీసులు రెచ్చిపోయి విచ్చలవిడిగా కాల్పులు జరుపుతారు. 'ఆత్మరక్షణ' కోసం జరిపామంటారు గానీ, యిందులో వుండేది ఆత్మరక్షణకాదు, ప్రతీకారం. తమ మాటకు ఎదురుచెప్పినా, తమ కర్రలకు అడ్డం తిరిగినా, రెండు రాళ్లు వేసినా, ఒళ్లు తెలియకుండా రెచ్చిపోయి, విచక్షణా రహితంగా కాల్పులు జరపడం తమ హక్కని పోలీసులు భావిస్తారు. వాళ్లకు యిచ్చే తర్ఫీదే అటువంటిది.

దాదాపుగా అన్ని కాల్పుల సంఘటనల కథ యిదే. అయితే అప్పుడప్పుడు యిందులో కొంత వెరైటీ చోటు చేసుకుంటుంది. స్థానిక రాజకీయ నాయకుల ప్రాబల్యం, స్థానిక పెత్తందారీవర్గాల అవసరాలు, పోలీసులలో అవినీతి, ఆశ్రిత పక్షపాతం, ఈ వెరైటీకి దోహదం చేస్తాయి.

(..... 3)

పోలీసులకు ఏట్టి పరిస్థితిలోనూ ప్రజలను చంపే అధికారం చట్టంలో ఎక్కడా లేదు. ఏదయినా దొమ్మీ లేక కల్లోలం కారణంగా ప్రజలు పెద్దఎత్తున హింసకు పాల్పడితే ఆహింసను నిరోధించడానికి పోలీసులు బలప్రయోగం చేయవచ్చనీ, అవసరమయితే కాల్పులు కూడ జరపవచ్చనీ నేర విచారణ స్మృతి (Cr.P.C.) అంటుంది. అయితే ఈ బలప్రయోగం, కాల్పులు, ప్రాణాలు తీయడానికి కాదు. హింసను నివారించడానికి మాత్రమే. అది కనీస బలప్రయోగం కావాలే తప్ప విచ్చలవిడి బలప్రయోగం కావడానికి వీలులేదు. కాల్పులు జరిపితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి కాల్పులు జరపవలసిన పరిస్థితి ఏర్పడిందా, లేదా అని నిర్ణయించే బాధ్యతను చట్టం పోలీసుల చేతినుండి తీసేసి, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేటు (కలెక్టరు, ఆర్.డి.వో, తాసిల్దారు వగైరా) చేతిలో పెట్టింది. వాళ్ల అనుమతి లేకుండా పోలీసులు కాల్పులు జరపడానికి వీలులేదని చట్టం స్పష్టం చేస్తుంది. ప్రాణాలు తీసే అధికారాన్ని చట్టం ఏట్టి పరిస్థితులలోనూ పోలీసులకు యివ్వదు.

గతంలో పోలీసులు ఈ చట్టాన్ని గౌరవించినట్లు నటించేవాళ్లు. ఏదయినా అలజడి జరు... వుంటే స్థానిక ఆర్.డి.వో.ను వెంటపెట్టుకొనిపోయి అతని అనుమతి తీసుకొని కాల్పులు జరిపేవా... పోలీసులు అడిగితే కాదనగల అధికారులు భారతదేశంలో యిప్పటికి పుట్టలేదు. కాబట్టి ఏ యిబ్బందీ లేకుండా కాల్పులు జరిగిపోయేవి. అయితే క్రమంగా ఈ కనీస ఆచారాన్ని పాటించడం కూడ పోలీసులు మానుకుంటున్నారు. గత సంవత్సరం జరిగిన పొన్నూరు, రెంటచింతల, కలువరాల కాల్పులలోగానీ, ఈ సంవత్సరం యిప్పటికి జరిగిన ~~ఐదు~~ ఏడు కాల్పులలో గానీ, ఆర్డివో, తాసీల్దార్ వంటి అధికారుల ప్రమేయమేమీ లేదు. ఇదేదో కాకతాళీయంగా జరిగిన మార్పు కాదు. తమకే ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అధికారాలు యివ్వాలనేది పోలీసులు చాలా కాలంగా పెడుతూన్న డిమాండు. ఆ అధికారాలు యిప్పటిదాకా వాళ్లకు దత్తం కాలేదుగానీ, ఆచరణలో అయినట్టే ప్రవర్తిస్తున్నారు. పోలీసులను నియంత్రించడంలో ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్లకు వుండే పాత్ర చట్టంలో ఏ మార్పూ లేకుండానే వాస్తవానికి ఏ మాత్రం మిగలకుండా పోయింది.

అందుకనే యిప్పుడు జరిపే కాల్పులన్నింటిలోనూ పోలీసులు 'ఆత్మరక్షణ' అనే కథ అల్లుతున్నారు. దొమ్మీని నిరోధించడానికి కాల్పులు జరపాలంటే ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అనుమతి కావాలిగానీ, 'ఆత్మరక్షణ' చేసుకోవడానికి పోలీసులకే కాదు, ఎవరికీ ఎవరి అనుమతీ అక్కరలేదు. అందుకే అన్ని పోలీసు కాల్పులలోనూ ప్రజలు తమమీద దాడిచేసారనీ, తుపాకులు లాక్కునే ప్రయత్నం చేసారనీ, తాము ఆత్మరక్షణార్థం కాల్పులు జరిపామనీ ఒకే మూసలో పోసిన కథ చెప్తున్నారు. ఇప్పటిదాకా ఏ సంఘటనలోనూ అటువంటిదేమీ జరగలేదు.

''ఆత్మరక్షణ'' పేరిట పోలీసులు ప్రజలమీద ఎప్పుడు కాల్పులు జరిపి ప్రాణ నష్టం కలిగించినా దానిని హత్యగా భావించి పోలీస్ అధికార్ల మీద కేసులు పెట్టాలనీ ఆ హత్య ఆత్మరక్షణార్థం చేయవలసి వచ్చిందని రుజువు చేసుకునే బాధ్యత పోలీసుల మీదనే పెట్టాలనీ డిమాండు చేస్తూ

(.....4)

ఉద్యమిద్దాం. గతంలో సంవత్సరానికో రెండేళ్ళకో ఒక కాల్పుల సంఘటన జరిగేది - చీరాల, సిరిసిల్ల, ఇంద్రవెల్లి, కొండ మొదలు, టంగుటూరు, అన్నపురెడ్డిపల్లి, వగైరా - ఇప్పుడు సుమారు అయిదు నెలల్లో ~~ఆరు~~ ఏడు సంఘటనలు జరిగి 20 ప్రాణాలు పోయాయంటే పోలీసుల ప్రవర్తన పట్టపగ్గాలు లేకుండా పోతోందని గుర్తించి పోలీసుల తుపాకుల మీద న్యాయసమ్మతమైన నియంత్రణ ఉండాలని డిమాండు చేద్దాం. ఈ ~~ఆరు~~ ఏడు సంఘటనలకు బాధ్యులయిన పోలీసులను హత్య కేసులో అరెస్టు చేసి విచారించాలనీ, కాల్పుల మీద న్యాయ విచారణ జరిపించాలనీ డిమాండు చేద్దాం.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం

APCLC

నోట్ :- ఈ కరపత్రం అచ్చువేసి మీ జిల్లాలో వీలయినంత విస్తృతంగా పంచండి. అన్ని జిల్లాలలోనూ - కనీసం నిజామాబాద్, చిత్తూరు, నెల్లూరు, గుంటూరు జిల్లాలలో మీటింగ్‌లు పెట్టండి.

.....